# ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్



రాజంపేటలో ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

బాన్సువాడ/రాజంపేట్/భిక్కనూరు, సెప్టెంబర్ 9 : బాన్సువాడలోని శ్రీలక్ష్మీనర్సింహా కల్యాణ మండపంలో ఉత్తమ ఉపాధ్యాయులకు సోమవారం సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బాన్సువాడ వ్యవసాయ శాఖ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పోచారం మాట్లాడుతూ.. గురువే ప్రత్యక్ష దైవమని అన్నారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించి ప్రశంసాపత్రాలను వారు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో నాగేశ్వర్‌రావు, మున్సిపల్ చైర్మన్ గంగాధర్, కృష్ణారెడ్డి, డాక్టర్ అంజిరెడ్డి, ఖాలేక్, ఎజాస్, మాసాని అశోక్‌రెడ్డి, నార్ల సురేశ్ గుప్తా, ఏఎంసీ మాజీ చైర్మన్ నెర్రె నర్సింహులు, పీఆర్టీయూ జిల్లా ప్రతినిధులు కుషాల్, నర్వశ్రీనివాస్, మంద ప్రవీణ్‌కుమార్, దాసరి రమేశ్ కుమార్, విఠల్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాజంపేటలోని రైతు వేదికలో ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని 12 మందిని ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసినట్లు మండల విద్యాధికారి రామస్వామి తెలిపారు.

కార్యక్రమంలో తహసీల్దార్ అనిల్‌కుమార్, ఎంపీడీవో రాజేశం, నోడల్ ఆఫీసర్ పూర్ణచందర్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు వెంటేశ్వర్, ఈశ్వర్, కరీమొద్దీన్, భిక్షపతి, విజయలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భిక్కనూరులోని సౌత్ క్యాంపస్‌లో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు సౌత్ క్యాంపస్ పిన్సిపాల్ సహ ఆచార్యుడు డాక్టర్ సుధాకర్‌గౌడ్‌ను డాక్టరేట్స్ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో డాక్టరేట్ అసోసియేషన్ ప్రతినిధులు ప్రతిజ్ఞ, సంతోష్ గౌడ్, రాహుల్‌కుమార్, సత్యం, నారాయణ, యాలాద్రి, సరిత, సునీత, రమాదేవి, నిరంజాన్, పరిశోధకులు శ్రీకాంత్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## పాల్వంచలో జిల్లా స్థాయి ఖోఖో పోటీలు



ఖోఖో పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

మాచారెడ్డి, సెప్టెంబర్ 9 : పాల్వంచలోని జడ్పీహెచ్‌ఎస్‌లో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా 34వ సబ్ జూనియర్ ఖోఖో పోటీలను సోమవారం నిర్వహించారు. అండర్-14లో 60 జట్లు పాల్గొన్నాయి. 38 బాలుర జట్లు, 22 బాలికల జట్లు పాల్గొన్నట్లు ఖోఖో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు భూంరెడ్డి, అసోసియేషన్ చైర్మన్ అనిల్ తెలిపారు. అంతకు ముందు ఖోఖో పోటీలను అట్టహాసంగా ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. బాలికల విభాగంలో మొదటి స్థానంలో జడ్పీహెచ్ రాంపూర్, రెండో స్థానంలో స్ప్రింగ్ ఫీల్డ్స్ ఎస్ఎస్‌నగర్, మూడో స్థానంలో జడ్పీహెచ్‌ఎస్ శెట్పల్లి, జడ్పీహెచ్‌ఎస్ గర్గుల్‌లు సంయుక్తంగా నిలిచాయి. బాలుర విభాగంలో మొదటి స్థానంలో టీజీఎంఆర్‌జేసీ బాయ్స్-3, రెండో స్థానంలో టీజీఆర్ఎస్ మద్నూర్, మూడో స్థానంలో టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ ఎల్లారెడ్డి నిలిచాయి. గెలిచిన జట్లకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోవర్ధన్‌రెడ్డి, గ్రామపెద్దలు కూచని శేఖర్, నారాగౌడ్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## న్యాలమోరి గండికి మరమ్మతులు

నాగిరెడ్డిపేట, సెప్టెంబర్ 9 : మండలంలోని లింగంపల్లి కలాన్ గ్రామానికి వెళ్లే రోడ్డుపై ఉన్న పోచారం ప్రాజెక్టు ప్రధాన కాలువ న్యాల మోరికి పడిన గండికి సోమవారం నీటిపారుదలశాఖ అధికారులు మరమ్మతులు చేపట్టారు. న్యాల మోరి వద్ద పడిన బుంగకు చుట్టూ మరమ్మతులు చేశారు. స్లాబ్‌పై మట్టిని వేసి తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టారు. ప్రాజెక్టు నిర్మించిన సమయంలో న్యాల మోరి కావడంతో కాలువ వరద తాకిడికి పూర్తిగా వంగిపోయి రోడ్డుకు బుంగ పడి కూలిపోయినట్లు చెప్పారు. బంగ వద్ద నూతనంగా వంతెన నిర్మిస్తే.. ఇబ్బందులు తొలగిపోతాయన్నారు. విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్తామని చెప్పారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి, వనజ, నీటి పారుదలశాఖ వర్క్ ఇన్‌స్పెక్టర్ యాదగిరి తదితరులు ఉన్నారు.



మరమ్మతు పనులు పరిశీలిస్తున్న అధికారులు

## ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి



ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

కామారెడ్డి, సెప్టెంబర్ 9 : ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ ఆయా శాఖల అధికారులకు సూచించారు. కామారెడ్డి సమీకృత కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. ప్రజావాణిలో భూ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వచ్చే ఫిర్యాదులను రెవె న్యూ అధికారులు తక్షణమే పరిష్కరించాలన్నారు. ప్రజావాణి నుంచి 114 ఫిర్యాదులను స్వీకరించామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో సురేందర్, జడ్పీ సీఈవో చందర్ నాయక్, డీపీవో శ్రీనివాస్, జిల్లా అధికారులు, కలెక్టర్ ఏవో మసూర్ అహ్మద్ పాల్గొన్నారు.

**రేషన్‌దుకాణాన్ని గ్రామంలోనే కొనసాగించాలి**

ఎల్లారెడ్డి రూరల్, సెప్టెంబర్ 9 : తమ గ్రామానికి మంజూరైన రేషన్ దుకాణాన్ని తమ గ్రామంలోనే కొనసాగించాలని సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో రేపల్లెవాడ గ్రామస్తుడు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. మండలంలోని రేపల్లెవాడ గ్రామానికి చెందిన నాయికోటి రవి రేషన్ దుకాణాన్ని తమ గ్రామంలోనే కొనసాగించాలని జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశాడు. రేషన్ దుకాణం నం.2922010 గల లైసెన్స్ హోల్డర్ నాగం సురేందర్ రేపల్లెవాడకు చెందిన రేషన్ దుకాణాన్ని ఎల్లారెడ్డి పట్టణంలో నిర్వహిస్తున్నాడన్నారు. రేషన్ తెచ్చుకోవాలంటే ఐదు కిలో మీటర్లు వెళ్లాల్సి వస్తోందని, దీంతో రేపల్లెవాడ గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారన్నారు. గ్రామస్తులకు ఇబ్బందులు కలుగకుండా రేపల్లెవాడలోనే రేషన్ దుకాణం నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆయన కలెక్టర్‌ను కోరారు.

## గ్రామాభివృద్ధి కమిటీ భూమిని కాపాడుకుంటాం..

**కబ్జా చేసిన స్థలాన్ని పరిశీలించిన బీఆర్ఎస్ నాయకులు**



స్థలాన్ని పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

భిక్కనూరు, సెప్టెంబర్ 9: మండల కేంద్రంలో గ్రామాభివృద్ధి కమిటీ పేరిట ఉన్న స్థలాన్ని కాపాడుకుంటామని బీఆర్ఎస్ నాయకులు స్పష్టం చేశారు. గ్రామాభివృద్ధి కోసం 1996లో 10 గుంటల భూమిని కొనుగోలు చేయగా.. ఆ భూమిని కొందరు చదును చేస్తున్నారు. దీంతో అఖిలపక్షం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఆదివారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. కబ్జాకు యత్నించిన భూమిలో చదును పనులను వెంటనే నిలిపివేయాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో చర్చి సమీపంలో ఉన్న గ్రామాభివృద్ధి కమిటీకి చెందిన పది గుంటల భూమిని బీఆర్ఎస్ నాయకులు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన భూమిని కొందరు కబ్జాకు యత్నిస్తున్నారని, స్థలాన్ని చదునుచేసి హద్దురాళ్లు ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. ఎవరు కబ్జా చేసినా సహించేది లేదని హెచ్చరించారు. అఖిలపక్షంతోపాటు అన్ని కుల సంఘాల ఆధ్వర్యంలో హద్దురాళ్లను తొలగించి స్థలాన్ని కాపాడుకుంటామని స్పష్టం చేశారు. స్థలాన్ని పరిశీలించిన వారిలో మాజీ సర్పంచ్ తునికి వేణు, ఆలయ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు మల్లేశం, బీఆర్ఎస్ నాయకులు రాంచంద్రం, వెంకట్‌గౌడ్, ప్రభాకర్, రవి తదితరులు ఉన్నారు.

## బేల్‌పూరి విక్రయించే వ్యక్తి మృతి

కామారెడ్డి, సెప్టెంబర్ 9 : జిల్లా కేంద్రంలో కొత్త బస్టాండ్ దగ్గర ఒక షాపు ఎదుట పడుకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని కొత్త బస్టాండ్ దగ్గర ఒక షాపు ఎదుట సుమారు 45నుంచి 50 ఏండ్ల వయస్సు ఉన్న మృతి చెందాడన్నారు. ఇతను రైలులో బేల్‌పూరి అమ్ముతాడని స్థానికులు తెలిపారు. మృతదేహాన్ని కామారెడ్డి ప్రభుత్వ దవాఖానలో భద్రపరిచామన్నారు. మరిన్ని వివరాలకు 8712686145, 8712666242 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.














